సాక్షి
ఏలూరు

ఆదివారం । 7 । జనవరి । 2024



శ్రీవారి తిరువీధి సేవ

ద్వారకాతిరుమల: చినవెంకన్న క్షేత్రంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శ్రీవారి తిరువీధి సేవ నేత్రపర్వంగా సాగుతోంది. భక్తులు నీరాజనాలు అర్పిస్తున్నారు.



భక్తుల రద్దీ సాధారణం

ద్వారకాతిరుమల: శ్రీవారి దివ్య క్షేత్రంలో శనివారం భక్తులు రద్దీ సాధారణంగా ఉంది. సంక్రాంతి ముందు రోజులు కావడంతో భక్తులు స్వల్ప సంఖ్యలో విచ్చేశారు.



హుండీ ఆదాయం లెక్కింపు

ఆకివీడు: స్థానిక పెద్దింటి అమ్మవారి ఆలయంలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు. రూ.1.52,926 ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈఓ రంగరాజు తెలిపారు.

న్యూస్‌రీల్

జాతీయ పోటీలకు ఎంపిక



నందిని

ఏలూరు రూరల్: ఏలూరు కస్తూరిబా బాలికల పాఠశాల క్రీడాకారిణి పి.నందిని జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యిందని హెచ్‌ఎం జి.సునీత ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 8 నుంచి 12 వరకు రాజస్థాన్‌లో జరిగే జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్‌ఐ అండర్‌-14 బాస్కెట్‌బాల్ పోటీల్లో ఆమె పాల్గొంటుందన్నారు. గత నవంబరులో చిత్తూరు జిల్లాలో జరిగిన అంతర జిల్లాల బాస్కెట్‌బాల్ పోటీల్లో నందిని ప్రతిభ చాటి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యిందన్నారు. 8వ తరగతి చదువుతున్న నందిని మూడుసార్లు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని గుర్తింపు తెచ్చుకుందన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు కె.మురళీకృష్ణ, ఎంవీఎల్ ప్రసన్న ఆమెను అభినందిచారు.

సంక్రాంతికి ప్రత్యేక బస్సులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సంక్రాంతి సందర్భంగా హైదరాబాద్ నుంచి సొంత గ్రామాలకు వచ్చే వారి కోసం ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు డిపోల నుంచి ఈనెల 10 నుంచి 13 వరకు 90 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్టు ఏలూరు జిల్లా ప్రజారవాణా అధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ బుకింగ్ ప్రారంభమైందని, అలాగే ఈనెల 16 నుంచి 21 వరకు ఆయా డిపోల నుంచి ఇప్పటివరకు దాదాపు 50 సర్వీసులకి రిజర్వేషన్ సౌ కర్యం ప్రారంభించామని పేర్కొన్నారు. తిరుపతి, విశాఖతో పాటు విజయవాడకు ప్రత్యేక బస్సులు నడుపుతామని తెలిపారు. సంక్రాంతి కానుకగా సాధారణ చార్జీలకే ప్రయాణికులకు టికెట్లు విక్రయిస్తున్నామని, రానుపోనూ టికెట్లు బుక్ చేసుకుంటే పది శాతం రాయితీ వర్తిస్తుందని పేర్కొన్నారు.

స్ట్రాంగ్‌రూమ్‌లు సిద్ధం చేయాలి



మాట్లాడుతున్న జేసీ రామసుందర్‌రెడ్డి

భీమవరం (ప్రకాశంచౌక్): రానున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో స్ట్రాంగ్‌రూమ్‌లను సిద్ధం చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లాలో ఐదు చోట్ల స్ట్రాంగ్‌రూమ్‌లు సిద్ధం చేయడంపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలోని ఒక పార్లమెంట్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన బ్యాలెట్ బాక్సులు, ఈవీఎంలు, వీవీ ప్యాడ్స్ భద్రపరిచేందుకు నెలాఖరులోపు ఐదు స్ట్రాంగ్‌రూమ్‌లు సిద్ధం చేయాలన్నారు. భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, పెనుగొండ మండలాల ట్రెజరీ కార్యాలయంలోని స్ట్రాంగ్‌రూమ్‌లో ఉన్న సామగ్రిని వేరోచోట భద్రపరిచి సిద్ధం చేయాలన్నారు. స్ట్రాంగ్‌రూమ్‌లో ఉన్న మెటీరియల్ శాఖల వారీగా కోర్టులు 28, పంచాయతీరాజ్ శాఖ 32, రెవెన్యూ శాఖ 5, జైలు శాఖ 2, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ 1, మున్సిపల్ శాఖ 1 మొత్తం 68 ఆర్టికల్స్ ఉన్నాయన్నారు. స్ట్రాంగ్‌రూమ్‌లను పరిశీలించి చిన్నపాటి మరమ్మతులు ఉంటే సరిచేసుకోవాలన్నారు. జిల్లా ఏఎస్పీ వి.భీమారావు, జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణరెడ్డి, జిల్లా ట్రెజరీ అధికారి ఆదారి గణేష్, జిల్లా రిజిస్ట్రార్ అధికారి ఆర్.సత్యనారాయణ, డీఈఓ ఆర్.వెంకటరమణ, తహసీల్దార్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

త్వరితగతిన పరిష్కరించాలి

కాళ్ల: ఓటరు నమోదు, తొలగింపు, జాబితాల్లో మార్పులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. బొండాడలో శుక్రవారం ఆమె పర్యటించి ఫొటోస్ సిమిలర్ ఎంట్రీస్, డెమోగ్రాఫికల్ సిమిలర్ ఎంట్రీస్ తొలగింపుల ప్రక్రియను శనివారం ఆమె స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతనెల 9 నుంచి అందిన దరఖాస్తులు, అభ్యంతరాలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఓటరు నమోదు అధికారులు నియోజకవర్గం, మండల కేంద్రంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించాలన్నారు. పోలింగ్ కేంద్రాలను పరిశీలించి మౌలిక వసతులపై నివేదిక సమర్పించాలన్నారు.

పింఛన్.. మేరిసెన్

కొత్తగా మురిపించెన్
- జిల్లాలో 4,096 కొత్త పెన్షన్లు
- పింఛన్‌దారుల్లో నూతనోత్సాహం
- కొత్త పింఛన్లకు అదనంగా రూ.1.22 కోట్లు మంజూరు
- మొత్తం 2,72,955 మంది లబ్ధిదారులు



ముసునూరులో నూతన పింఛన్లు అందిస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప అప్పారావు

సాక్షి ప్రతినిధి,ఏలూరు: 'ఇంటికి పెద్ద కొడుకులా ఆదుకుంటున్నారు.. పిల్లలున్నా, వృద్ధాప్యంలో ఆర్థిక అవసరాలకు వాళ్లను డబ్బులు అడగలేం.. అలాంటి మాకు ఒకటో తారీఖున ఠంచన్‌గా పింఛన్ రూ.3 వేలను వలంటీర్ అందించింది.. నెలవారీ మా ఖర్చులకు ఇది సరిపోతుంది.. ఇంతకంటే ఏం కావాలి..' ఇది కొత్తగా పింఛన్ పొందిన ఓ వృద్ధురాలి అంతరంగం. జిల్లాలో పెన్షన్ల పంపిణీ యజ్ఞంలా సాగుతోంది. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన రోజు నుంచి నేరుగా లబ్ధిదారుల ఇంటికే వలంటీర్ వెళ్లి పెన్షన్ నగదును ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ పింఛన్ల పంపిణీ యథావిధిగా సాగింది. అలాగే చెప్పిన మాట ప్రకారం పెన్షన్ రూ.3 వేలకు పెరిగింది.

నాలుగున్నరేళ్లలో గణనీయంగా..

2019 ముందు వరకు జిల్లాలో 1,08,905 పెన్షన్లు ఉండేవి. పార్టీతో సంబంధం లేకుండా అర్హతే ప్రామాణికంగా గడిచిన నాలుగున్నరేళ్లలో జిల్లాలో విడతల వారీగా పెన్షన్లను ప్రభుత్వం పెంచింది. ఏకంగా 1,64,050 పెన్షన్లు పెంచారు. దీంతో పింఛన్ లబ్ధిదారుల సంఖ్య 2,72,955కు చేరింది. ఈనెల 1న కొత్తగా 4,096 మందికి కొత్తగా పింఛన్లు మంజూరు చేశారు. దీంతో బడ్జెట్ రూ.1.22 కోట్లు అదనంగా పెరిగింది. ఇప్పటికే ఉన్న పింఛన్‌దారులకు రూ.81.53 కోట్లు పింఛన్ల రూపంలో ప్రతినెలా అందిస్తున్నారు.

అదనంగా రూ.1.22 కోట్లు

నియోజకవర్గాల వారీగా కొత్త పింఛన్లు ఇలా ఉన్నాయి.. చింతలపూడిలో 859 పెన్షన్లకు రూ.25.77 లక్షలు, దెందులూరులో 475 పెన్షన్లకు రూ.14.25 లక్షలు, కై కలూరులో 585 పెన్షన్లకు రూ.17.55 లక్షలు, నూజివీడులో 596 పెన్షన్లకు రూ.17.88 లక్షలు, పోలవరంలో 751 పెన్షన్లకు రూ.22.53 లక్షలు, ఉంగుటూరులో 349 పెన్షన్లకు రూ.10.44 లక్షలు, ద్వారకాతిరుమల మండలంలో 122 పెన్షన్లకు రూ.5.31 లక్షలు ఇప్పటికే పంపిణీ చేశారు.

చాలా ఆనందం



పింఛన్ సొమ్ము ప్రతి నెలా 1న ఇంటికొస్తుంది. వలంటీర్ తలుపుతట్టి పెన్షన్ డబ్బులు ఇస్తున్నారు. ఈనెల నుంచి రూ.3 వేలు చేశారని చెప్పారు. చాలా ఆనందంగా ఉంది. సీఎం జగన్ నాలాంటి వృద్ధులను పెద్ద కొడుకులా ఆదుకుంటున్నాడు. మాట ఇచ్చినట్టే పింఛన్ పెంచారు.

– బంటుమిల్లి గంగమ్మ, సత్తెన్నగూడెం, ద్వారకాతిరుమల మండలం

అవసరాలు తీరుతున్నాయి



నా భర్త ఆరు నెలల క్రితం మృతిచెందగా పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నా. ఈనెల రూ.3 వేల పింఛన్ తీసుకున్నా. సీఎం జగన్ ఇచ్చిన మాట ప్రకారం విడతల వారీగా పింఛన్ మొత్తాన్ని పెంచుతూ వచ్చారు. నా కుటుంబ అవసరాలకు ఈ మొత్తం ఎంతగానో ఉపయోగపడుతుంది.

– పసుపులేటి వరలక్ష్మి, కేతవరం, జంగారెడ్డిగూడెం మండలం

సొంత కొడుకులా..



ఇంట్లో కొడుకులు, కూతుళ్లు చూసినా, చూడకపోయినా బంధువులు పట్టించుకున్నా, పట్టించుకోకపోయినా సీఎం జగన్ పెద్ద దిక్కుగా మాకు భరోసా కల్పించారు. వృద్ధులందరికీ ముఖ్యమంత్రే కుటుంబంలో ప్రధాన వ్యక్తిగా మారారు. మరోసారి సీఎంగా వైఎస్ జగనే రావాలి.

– పి.వీరకుమారి, మేధినరావుపాలెం, దెందులూరు మండలం

ఇంటికి వచ్చి సొమ్ములు



గతంలో పెన్షన్ కోసం కష్టాలు పడిన వాళ్లను చూసి ఇదేం బాధరా అనుకునేవాళ్లం. ఇటీవల నా భర్త చనిపోతే వితంతు పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నా. రెండు నెలల్లో పెన్షన్ మంజూరైంది. వలంటీర్ ఇంటికి వచ్చి సొమ్ములు అందించారు. జగన్ పాలన పదికాలాల పాటు ఇలానే ఉండాలి.

– వింజమూరు వెంకాయమ్మ, అంకాలగూడెం, కొయ్యలగూడెం మండలం

సంతృప్తికరంగా భూసర్వే



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ లావణ్యవేణి

ఏలూరు(మెట్రో): జగనన్న భూహక్కు–భూరక్ష పథకానికి సంబంధించిన రీసర్వే పనులు రైతులకు సంతృప్తినిచ్చేలా ఉండాలని జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో రీ సర్వేకు సంబంధించిన సమస్యల అంశాలపై జిల్లాలోని సర్వేయర్ల ట్రైనింగ్ కార్యక్రమం సర్వే ఏడీ పి.లక్ష్మణరావు అధ్యక్షతన నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ ఎఫ్ లైన్ పిటీషన్లు రైతుల నుంచి వస్తున్నాయని, వీటిని దృష్టిలో పెట్టుకుని క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. రీసర్వే పూర్తయిన గ్రామాలకు సంబంధించి రీసర్వే నివేదిక పరిశీలించి స్పష్టతను గ్రహించాలన్నారు. ఈ సమావేశంలో ఎఫ్ లైన్ పిటీషన్లు, రీసర్వే ప్రతిపాదనలు, భూముల గుర్తింపు, స్టేజివారీ రీసర్వే అప్లయ్ చేయడం, రీసర్వే అప్లయ్, గ్రౌండ్ ట్రూత్‌లో సందేహాలు, బౌండరీస్ సమస్యలు తదితర అంశాలపై చర్చించారు. బాధ్యతాయుతంగా సర్వేయర్లు సర్వే చేపట్టి దీనిపై ఎటువంటి పిటీషన్లు రాకుండా చూడాలన్నారు. అనంతరం నూతన, సంక్రాంతి సందర్భంగా సర్వేయర్లు ఏర్పాటు చేసిన కేక్‌ను జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి కట్ చేసి అందరికీ నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, జిల్లాలోని డివిజన్, మండల, గ్రామస్థాయి సర్వేయర్లు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతి ప్రభుత్వ లక్ష్యం



నూజివీడులో మహిళా మార్ట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు సీఎం జగన్ తోడ్పాటు అందిస్తున్నారని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. పట్టణంలో డ్వాక్రా మహిళలు రూ.36 లక్షలతో ఏర్పాటు చేసిన నూజివీడు చేయూత మహిళా మార్ట్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడుతూ మహిళా మార్ట్‌లో నాణ్యమైన సరుకులను తక్కువ ధరకు విక్రయిస్తున్నందున మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో మహిళాభివృద్ధికి పథకాలు అమలు చేస్తున్నారన్నారు. డ్వాక్రా సంఘాలకు లింకేజీ రుణాన్ని రూ.20 లక్షలకు పెంచారన్నారు. డ్వాక్రా రుణమాఫీతో పాటు సున్నావడ్డీని క్రమం తప్పకుండా అమలుచేస్తున్నారన్నారు. జిల్లాలో చింతలపూడి, జంగారెడ్డిగూడెంలో మార్ట్‌లు ఉన్నాయని, నూజివీడులో మూడో మార్ట్ ఏర్పాటుచేశారన్నారు. రానున్న రోజుల్లో మహిళలంతా సీఎం జగన్‌కు అండగా ఉండాలని కోరారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ మహిళలు తమ కాళ్లపై తాము నిలబడాలన్నదే సీఎం వైఎస్ జగన్ ధ్యేయమన్నారు. సెర్ప్ అడిషనల్ డైరెక్టర్ మహిత మాట్లాడుతూ రాష్ట్రంలో 45 మహిళా మార్ట్‌లను ఏర్పాటు చేశామని, నూజివీడు మార్ట్ 46వదని అన్నారు. 16 నెలల కాలంలో ఈ మార్ట్‌ల ద్వారా రూ.70 కోట్ల వ్యాపారం నిర్వహించామన్నారు. సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు, కృష్ణా జిల్లా జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, ఎంపీపీ ఆరేపల్లి శిరీష, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు పగడాల సత్యన్నారాయణ, కొమ్ము వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీలు అక్కినేని శ్రీవాణి, దండుబోయిన స్వర్ణలత, ఏసీ విజయకుమారి, ఏపీఎం దయాల రాజశేఖర్, మండల సమాఖ్య అధ్యక్షురాలు కొమారపు నవత, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు శీలం రాము, విద్యా మౌళిక సదుపాయాల సంస్థ డైరెక్టర్ కలగర వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రతిపక్షాల కుట్రలకు ప్రజలే బదులిస్తారు

ఎమ్మెల్యే ఆళ్ల నాని



చాటపర్రులో పింఛన్లు అందిస్తున్న ఎమ్మెల్యేలు నాని, అబ్బయ్యచౌదరి, జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

ఏలూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై ప్రతిపక్షాలు చేస్తున్న కుట్రలకు ప్రజలే గుణపాఠం చెప్పాలని వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆళ్ల నాని పిలుపునిచ్చారు. శనివారం ఏలూరు రూరల్ మండలం చాటపర్రులో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్నందున టీడీపీ, జనసేన నాయకులు సీఎం జగన్‌పై అసత్య ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుంటే తప్పుడు కథనాలు, వార్తలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకిచ్చిన మాట ప్రకారం సీఎం జగన్ రాష్ట్రంలో సంక్షేమాన్ని అందిస్తున్నారన్నారు. సంక్షేమం, అభివృద్ధితో ప్రజల మనసులు గెలిచారని కొనియాడారు. అధికారమే పరమావధిగా భావించి టీడీపీ, జనసేన నాయకులు చేస్తున్న కుట్రలు, కుతంత్రాలకు జవాబుగా రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయఢంకా మోగించడం ఖాయమన్నారు. ఏలూరు, దెందులూరు నియోజకవర్గాల్లో 50 వేల మెజార్టీతో పార్టీ అభ్యర్థులు గెలుస్తారన్నారు. ప్రతిపక్షాలు ఎలాంటి పన్నాగాలు వేసిన సీఎం జగన్‌ను ప్రజల నుంచి దూరం చేయలేరన్నారు. ఇచ్చిన మాట ప్రకారం సీఎం జగన్ పింఛన్‌ను రూ.2 వేల నుంచి రూ.3 వేలకు పెంచారని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ కొనియాడారు. ముందుగా నాయకులు ఏలూరు రూరల్ మండల తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు, జెడ్పీటీసీ మండల సరస్వతి, వడ్డీ కార్పొరేషన్ చైర్మన్ ముంగర సంజీవ్‌కుమార్, ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, ఏలూరు నగర కార్పొరేషన్ డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్‌బాబు, ఎఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, అప్పన్నప్రసాద్, ఘంటా ప్రసాద్, ఎస్‌ఎంఆర్ పెదబాబు పాల్గొన్నారు.

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక



ముస్లిం యువతను పార్టీలోకి ఆహ్వానిస్తున్న మండలి చైర్మన్ మోషేన్‌రాజు, ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ

కైకలూరు: తెలుగుదేశం పార్టీ అనుసరిస్తున్న విధానాలు నచ్చక.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ఆకర్షితులవుతూ ముస్లిం యువకులు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. కై కలూరు మార్కెట్ యార్డ్‌లో జరిగిన ఏఎంసీ చైర్మన్ వైస్ చైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవంలో ఆసాని ఖాన్, సలీం, బాజీ, హబీబ్ బాషా, ఆరిఫ్, జబ్బర్, గౌస్, హనీఫ్, నయీమ్, నవ్యాత్, రెహమాన్ వైఎస్సార్‌సీపీ పార్టీలో చేరారు. శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ జాయింట్ సెక్రటరీ అబ్దుల్ హమీద్, వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, జిల్లా ముస్లిం మైనార్టీ విభాగ కమిటీ ప్రధాన కార్యదర్శి షేక్ రఫీ, జాయింట్ సెక్రటరీ షేకా మూసా, నాయకులు ఎస్‌డీ.బాషా, ఫిర్దోస్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కోట్లాది నిధులతో అభివృద్ధి పనులు

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

అత్తిలి: గ్రామాల్లో శాశ్వతమైన అభివృద్ధి పనులకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తోందని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. శనివారం ఉనికిలిలో రూ.35 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.24 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.20 లక్షలతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్ భవనాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్లను నిర్మించి, ప్రజలకు, రైతులకు సత్వర సేవలు అందిస్తున్న ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఆయా కేంద్రాల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని సీఎం జగన్ పాలనలో తీసుకువచ్చారన్నారు. అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, సర్పంచ్ వట్టికూటి అనంతలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు ముదునూరి దుర్గా భవానీ, సొసైటీ అధ్యక్షుడు వట్టికూటి సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ జడ్జిల నియామకం

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలోని కోర్టుల్లో పలువురు జూనియర్ సివిల్ జడ్జిలను నియమిస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. పాలకొల్లు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జిగా వీఎస్ఎన్ లక్ష్మి, ఏలూరు రెండో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి (జువైనల్ కోర్టు)గా బండి రచన, ఇప్పటివరకూ ఏలూరు జువైనల్ కోర్టు జడ్జిగా పనిచేస్తున్న ఎస్.వాసుదేవ్‌ను ప్రిన్సిపల్ సివిల్ జడ్జి, ఏలూరు, కావలిలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న రొఖ్కం వరలక్ష్మిని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, నరసాపురం, 3వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి, అనకాపల్లిలో పనిచేస్తున్న ఎం.శివకిరణ్‌ను కైకలూరు జూనియర్ సివిల్ జడ్జిగా నియమించారు.

12 వరకు అభ్యంతరాల స్వీకరణ

భీమవరం (ప్రకాశంచౌక్): భారత ఎన్నికల సంఘం తుది ఓటర్ల జాబితా విడుదల గడువు పొడిగించినందున ఈనెల 12 వరకు ఓటర్ల నమోదు క్లయిమ్‌లు, అభ్యంతరాలకు సంబంధించి అర్జీలు స్వీకరిస్తామని డీఆర్వో బి.శివన్నారాయణరెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లో శనివారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. క్లయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారం, పీఎస్ఈఎస్, డీఎస్ఈఎస్‌ల పరిష్కారం, జెండర్ రేషియో తదితర అంశాలపై చర్చించారు.

క్రీడలతో క్రమశిక్షణ, ఆరోగ్యం

ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్

ఏలూరు టౌన్: పోలీసు సిబ్బంది నిత్యం తీవ్ర ఒత్తిడితో విధులు నిర్వర్తిస్తుంటారని, స్పోర్ట్స్‌మీట్ పోలీస్ సిబ్బందికి క్రమశిక్షణతోపాటు సంపూర్ణ ఆరోగ్యానికి, మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తుందని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో పోలీస్ స్పోర్ట్స్‌మీట్–24 ముగింపు వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత జిల్లా ఎస్పీ డీ.మేరీ ప్రశాంతితో కలిసి గౌరవవందనం స్వీకరించారు. ఏలూరు జిల్లాలోని నాలుగు పోలీస్ సబ్‌డివిజన్లలోని పోలీస్ క్రీడాకారులతో చేపట్టిన మార్చ్‌ఫాస్ట్‌ను తిలకించారు. రెండు రోజులపాటు చేపట్టిన పోలీస్ స్పోర్ట్స్‌మీట్ ముగింపు వేడుకలు శనివారం ఉత్సాహంగా నిర్వహించారు. పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన అనంతరం ఐజీ అశోక్‌కుమార్ బృందం, ఎస్పీ మేరీ ప్రశాంతి బృందం టగ్ ఫర్ వార్‌ను ఉల్లాసంగా నిర్వహించారు. ముగింపు వేడుకల్లో ఐజీ మాట్లాడుతూ... పోలీస్ సిబ్బంది మానసిక ఉల్లాసానికి, శారీరక ఆరోగ్యానికి క్రీడలు దోహదం చేస్తాయన్నారు. ఎస్పీ మేరీ ప్రశాంతి ఆధ్వర్యంలో స్పోర్ట్స్‌మీట్‌ను అద్భుతంగా నిర్వహించటం సంతోషమన్నారు. ఇదే స్ఫూర్తితో రాబోయే సార్వత్రిక ఎన్నికలను విజయవంతంగా పూర్తిచేసి, ప్రజల మన్ననలు పొందాలని చెప్పారు. వేడుకల్లో ఏలూరు అదనపు ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్ఎస్ శేఖర్, ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, డీఎస్పీ ఈ.శ్రీనివాసులు, డీటీసీ డీఎస్పీ ప్రభాకరరావు, ఏఆర్ ఆర్ఐ పవన్‌కుమార్, ఎస్బీ సీఐ ఆదిప్రసాద్, నగరంలోని సీఐలు ప్రభాకర్, రాజశేఖర్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



పోలీస్ స్పోర్ట్స్‌మీట్-24 ముగింపు వేడుకల్ని గన్‌ఫైర్ చేసి ప్రారంభించిన ఐజీ అశోక్‌కుమార్

వై నాట్ షోరూం ప్రారంభం

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : వినియోగదారులకు అందుబాటు ధరల్లో ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాలు అందిస్తూ వై నాట్ ఎలక్ట్రానిక్స్, హోమ్ అప్లయన్సెస్ వినియోగదారుల మన్ననలు పొందుతుందని వైనాట్ ఎలక్ట్రానిక్స్, వైనాట్–హవెల్స్ ఇండియా లిమిటెడ్, లాయడ్ స్టేట్ హెడ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ బి.హేమసుందర్ తెలిపారు. శనివారం అల్లవరం వద్ద కోడూరుపాడులో వైనాట్ ఎలక్ట్రానిక్స్, హెూమ్ అప్లయన్సెస్ షోరూంను హేమసుందర్ ప్రారంభించారు. సేల్స్ విభాగాన్ని ఐఎఫ్‌బీ ఇండస్ట్రీస్ లిమిటెడ్ హోమ్ అప్లయన్సెస్ విభాగం బిజినెస్ హెడ్ డీకే అరుణ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా హేమసుందర్ మాట్లాడుతూ ఉభయ గోదావరి, విశాఖపట్నం జిల్లాల్లో 29 షోరూంలు ఏర్పాటుచేసి అన్ని గృహోపకరణాలు ఒకేచోట తక్కువ ధరలకు అందిస్తున్నామన్నారు. షోరూం అధినేత జుజ్జవరపు రాయుడు మాట్లాడుతూ పలు కంపెనీల ఉత్పత్తులు సామాన్యులకు అందుబాటు ధరలలో ఇస్తున్నట్లు తెలిపారు. అలాగే లక్కీ డ్రాలో రిఫ్రిజిరేటర్ బహుమతిగా అందిస్తునట్లు తెలిపారు. కార్యక్రమంలో హయర్ బ్రాంచ్ మేనేజర్ సుధీర్, ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా లిమిటెడ్ బ్రాంచ్ మేనేజర్ యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.



అల్లవరంలో వై నాట్ షోరూం ప్రారంభిస్తున్న హేమ సుందర్

అంగన్‌వాడీలు విధుల్లో చేరాలి

ఏలూరు (టూటౌన్): జిల్లాలోని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ అంగన్‌వాడీ వర్కర్లు ఈ నెల 8న తమ అంగన్‌వాడీ సెంటర్లలో విధులకు హాజరుకావాలని జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ సాధికారిత అధికారి కెవీఎల్ పద్మావతి శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 6న ప్రభుత్వం విడుదల చేసిన జీవో ప్రకారం అంగన్‌వాడీలు గడువులోగా విధులకు హాజరు కావాలన్నారు. ప్రభుత్వం విధించిన గడువులోపు విధులకు హాజరు కాని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ అంగన్‌వాడీ వర్కర్లు ప్రభుత్వం తీసుకునే చర్యలకు బాధ్యులుగా పేర్కొన్నారు.

38 కిలోల గంజాయి స్వాధీనం

ఏలూరు టౌన్ : ఏలూరు జిల్లా పెదపాడు మండలం కలపర్రు టోల్ ప్లాజా వద్ద గంజాయి స్వాధీనం చేసుకుని, రవాణా చేస్తున్న నలుగురిని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టి 38 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నలుగురు నిందితులను, రెండు కార్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఈబీ ఏలూరు సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్ఈబీ టాస్క్‌ఫోర్స్ సీఐ ధనరాజ్ తెలిపారు. విశాఖపట్నం నుంచి మధ్యప్రదేశ్‌కు గంజాయిని రవాణా చేస్తుండగా ఎస్ఈబీ అధికారులకు వచ్చిన సమాచారం మేరకు కలపర్రు టోల్‌ప్లాజా వద్ద సీజ్ చేశారు. మధ్యప్రదేశ్ గ్వాలియర్ ప్రాంతానికి చెందిన హరియోమ్, దీపక్ కుమార్, కలిపురానికి చెందిన గణేష్ మిశ్రా, మహారాజ్‌పూర్‌కు చెందిన వినోద్‌లను అరెస్టు చేశామన్నారు. రెండు కార్లు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



గంజాయి స్వాధీనం చేసుకున్న ఎస్ఈబీ అధికారులు

రైలు ఢీకొని వ్యక్తి మృతి

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం–నవాబుపాలెం రైల్వేస్టేషన్ల మధ్యలో శనివారం ఉదయం 7.30 గంటల ప్రాంతంలో నవాబుపాలెం స్టేషన్ దగ్గరలో గుర్తు తెలియని రైలు ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతిచెందారని తాడేపల్లిగూడెం జీఆర్‌పీ ఎస్ఐ జి.శ్రీహరిబాబు తెలిపారు. మృతుడి వయసు సుమారు 35 సంవత్సరాలు ఉంటుందని, నీలం రంగుపై నలుపు రంగు పువ్వుల షర్టు, తెలుపు రంగు బనియన్ ధరించినట్లు చెప్పారు. మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్లు చెప్పారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాల కోసం 94906 17090 నెంబరులో సంప్రదించాలన్నారు.



మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి

విద్యకు ప్రభుత్వ సాయం భేష్

ఉండి : నిరుపేదల విద్యకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం చాలా గొప్పదని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ అన్నారు. శనివారం మండలంలోని ఎన్నార్పీ అగ్రహారంలో ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం మాల మహానాడు ముఖ్యనాయకులతో మండలాధ్యక్షుడు తొర్లపాటి భాగ్యరాజు ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం ముందడుగు వేయాలంటే చదువు ఒక్కటే ఆయుధమని అన్నారు. నిరుపేదలు చదువులో వెనుకబడకుండా కార్పొరేట్‌కు ధీటుగా ఇంగ్లీషు మీడియం చదువులు ప్రవేశపెట్టారని అన్నారు. అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, విదేశీ విద్యా దీవెన అంటూ ఎన్నో రకాల ప్రోత్సహకాలు అందిస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ విద్యపై సహకారాన్ని వినియోగించుకుని జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి చిగురుపాటి రాజేష్, రాజ్‌కుమార్, నాయకులు సాయి జగన్, పిట్టా వినోద్ కుమార్, గోర్ల గోపీ, నేతల సాల్మన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

భారీగా నగదు పట్టివేత

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి) : జీలుగుమిల్లి అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద స్థానిక పోలీసులు భారీగా నగదు పట్టుకున్నారు. సీఐ బి.వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం జీలుగుమిల్లి చెక్ పోస్ట్ వద్ద శనివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా తెలంగాణ సత్తుపల్లి నుంచి కోనసీమ అంబేడ్కర్ జిల్లా రావులపాలెం వెళ్తున్న కారును తనిఖీ చేయగా.. కారులో భారీగా నగదు పట్టుకున్నట్లు చెప్పారు. నగదు సుమారు రూ.50 లక్షలు వరకూ ఉందన్నారు. పట్టుబడిన నగదుపై ఇన్‌కంట్యాక్స్ అధికారులకు సమాచారం అందించామని చెప్పారు.



జీలుగుమిల్లి చెక్‌పోస్ట్ వద్ద పట్టుబడ్డ నగదు

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

జంగారెడ్డిగూడెం: యువకుడి మృతి ఘటనపై తల్లి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ట్రైనీ డీఎస్పీ బి.విద్య తెలిపారు. స్థానిక ముత్యాలమ్మ నగర్‌లో నివాసం ఉంటున్న కొండేపూడి మహేంద్రబాబు(25) కూలీపని చేస్తూ జీవిస్తున్నాడు. ఈ నెల 6 ఉదయం కూలికి వెళ్లిన మహేంద్రబాబు పారిజాతగిరి కొండ దిగువన ఉన్న ఓ రైతు పొలంలోని పాడుబడిన నీటి బావిలో పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వగా, ఘటనా స్థలానికి చేరుకున్న ట్రైనీ డీఎస్పీ బి.విద్య, పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. మహేంద్రబాబు ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందాడా? లేక మరే ఇతర కారణాలు ఉన్నాయా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ట్రైనీ డీఎస్పీ తెలిపారు. మహేంద్రబాబు తల్లి నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.